

2 లో నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి: మంత్రి నారాయణ

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :249 సంపాదకులు: కలిచేటి వెంకయ్య మంగళవారం 4 ఆగస్టు 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



## బీజేపీకి భారీషాక్..

బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు

మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం


ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ

**న్యూఢిల్లీ:** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్య పరిచారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈవిజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్ట నున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం. మిగతా 2లో...

# తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి

రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి - ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి, సింధూరదర్శిని:**
ఎల్ నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను, రిజర్వాయర్లలో, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటి కప్పుడు అంచనా వేసుకుంటూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నందున్న కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు. కృష్ణానదిలో కొద్ది రోజులుగా ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రికి మిగతా 2లో

# జగన్ డైరెక్షన్‌లోనే అటవిక చర్యలు

- రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడింది: మంత్రి పార్థసారథి
-జగన్ అండతో వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్న మంత్రి
-కర్నూలులో దళిత కుటుంబంపై వైసీపీ ఎమ్మెల్యే దాడి అమానుషం అని వ్యాఖ్యలు
-దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనం దారుణమంటూ విమర్శలు
-తప్పు చేస్తే సొంత నేతలనూ చంద్రబాబు మందలిస్తారని వెల్లడి
-అరాచక శక్తులను ఉపేక్షించం, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**అమరావతి, సింధూరదర్శిని:**
రాష్ట్రంలో వైసీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాల వెనుక ఆ పార్టీ అధినేత జగన్ డైరెక్షన్ ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ పెంచి పోషిస్తున్న రౌడీ మూకల ఆటవిక చర్యలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడిందని ఆయన హెచ్చరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలపై విరుచుకుపడ్డారు. "ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుంటే, మరోవైపు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేని వైసీపీ.. యువతను గంజాయి, రౌడీయిజం వైపు మళ్లించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. కులాల మధ్య చిచ్చుపెట్టడం, విధ్వంసం సృష్టించడమే వైసీపీలో కొనసాగడానికి అర్హతగా మారింది. తప్పు చేసి దొరికిపోయాక, 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సోషల్ మీడియాలో ఏడవడం ఆ పార్టీకి అలవాటైంది" అని పార్థసారధి ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఒక దళిత కుటుంబంపై బరిసెలు, మిగతా 2లో...

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి

ఐకానిక్ భవానాల నిర్మాణ పనులు పురోగతిపై నారాయణ సమీక్షా సమావేశం

నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో అధికారుల నుంచి తెలుసుకున్న నారాయణ

వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్న మంత్రి నారాయణ



**అమరావతి, సింధూరదర్శిని:**
రాజధాని అమరావతి పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో కలిసి పనుల మిగతా 2లో...



## ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

**అమరావతి, సింధూరదర్శిని:**
కోవిడ్-19 నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ.105 కోట్లతో నిర్మితమై నిరుపయోగంగా మారిన పీఎస్‌ఏ ( ప్రెషర్ స్వింగ్ అడ్సార్ప్షన్) ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల విషయాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని మిగతా 2లో...

# అర్హులందరికీ 'నేతన్న సేవలో..'

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత - ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం

ఈ నెల 7 నుంచి పథకం అమలు - 5 తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు తుది గడువులోగా చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలి

**అమరావతి, సింధూరదర్శిని:** అర్హులైన వారందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేస్తామని, చేనేతలకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. నేతన్నలకు ఏటా మిగతా 2లో...





## పొగాకు రైతులను ఆదుకోలేని జగన్‌కు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు

మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, సింధూరదర్శిని:**
రైతుల సంక్షేమం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు రైతులపై ప్రేమ మిగతా 2లో...

## తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు వివరించారు. కృష్ణా బేసిన్లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని...దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ తాగునీటి పరీక్షలు జరపాలని... ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదల చేయాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి... అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రవాణ శాఖలో పూర్తి స్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం-5దీ వంటి పరీక్షలను తొలగించడం వంటి చర్యల ద్వారా అవినీతిని తగ్గించడం, సులభతర సేవలను అందించే అవకాశం కలుగుతుందని అధికారులు చెప్పారు. దశలవారీగా రవాణా శాఖలో ఈ సంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బీజేపీకి భారీ షాక్..

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేక పోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## జగన్ డైరెక్షన్‌లోనే అటవిక చర్యలు..

(మొదటిపేజీ తరువాయి)

మారణాయుధాలతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మంత్రి తీవ్రంగా ఖండించారు. “ఒక దళిత సోదరి ఇంట్లోకి చొరబడి, ఆమె బట్టలు చించి అవమానించి, పైగా బాధితులే బట్టలు చించుకున్నారని సిగ్గులేకుండా ప్రచారం చేయడం వైసీపీ నీచ రాజకీయాలకు పరాకాష్ఠ. శ్రీకాకుళంలో మహిళా సీఐని అవమానించిన ఘటన నుంచి నేటి వరకు దళితులు, మహిళలపై వైసీపీ నేతల దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 ఏళ్లు దాటిన గొర్రెల కాపరి మరణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు, పేదల ప్రాణాలంటే ఆయనకున్న చులకన భావాన్ని, విపరీత మనస్తత్వాన్ని బయటపెట్టాయని అన్నారు. తమ పార్టీ నేతలు తప్పు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు మందలించి సరైన మార్గంలో పెడతారని, కానీ జగన్ మాత్రం తన పార్టీ నేతల అరాచకాలకు అండగా నిలుస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారని పార్థసారథి విమర్శించారు. “నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ అని ఎన్నికల ముందు నాటకాలు ఆడిన జగన్, ఇప్పుడు అదే దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, దోషులకు కఠిన శిక్షలు తప్పవని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ఇటువంటి అరాచక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల్‌రెడ్డితో పాటు పలువురు చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అమరావతి ల్యాండ్‌మార్క్‌లుగా నిలవనున్న అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ఏయే దశల్లో ఉన్నాయనే వివరాలను నారాయణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా నిర్మాణాలు నిలిచిపోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటూ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు (టార్గెట్స్) ప్రకారమే రాజధాని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలకు, అధికారులకు మంత్రి నారాయణ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి

(మొదటిపేజీ తరువాయి)

వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో రెండు గంటలపాటు లోతుగా సమీక్షించారు. ఎల్ఎంఓ కొనుగోళ్లకు సంబంధించి, వాస్తవ డిమాండ్, సరఫరా విషయాలపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి, లోపాల గుర్తింపు, సవరణ చర్యలను చేపట్టి, ఆమేరకు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో రెండు నెలలపాటు అమలుపరిచి అక్టోబరు 15 లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఎల్ఎంఓ డిమాండ్ మరియు సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోలు ఖర్చును వీలైనంత వరకు కొవిడ్-19 పూర్వ స్థితికి తీసుకురావాలని మంత్రి స్పష్టంచేశారు.

### భారీగా పెరిగిన ఆక్సిజన్ కొనుగోలు వ్యయం

కోవిడ్-19 తీవ్రంగా ఉన్న 2020-21, 2021-22 సంవత్సరాల్లో రూ.95.43కోట్ల మేరకు బోధనాసుపత్రుల్లో ఏల్ఎంఓ కొనుగోలు చేశారు. కో విడ్-19కు ముందు 2016-20 మధ్య కాలంలో (నాలుగేళ్లు) రూ.60.51 కోట్ల మేరకు వ్యయం చేశారు. కొవిడ్ అనంతరం 2022-26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంఓ కొనుగోలు వ్యయం రూ.180.82 కోట్లకు చేరిందని మంత్రి సమీక్షా సమావేశంలో గుర్తించారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు ఉనికిలోకి రావడం, పడకలు పెరగడం పెరుగుదలకు కొంతమేరకు కారణమైనప్పటికీ అధికారులు వివరించిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని, దీనిపై లోతుగా పరిశీలించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించే దిశగా అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఈ పరిశీలనకు అనంతపురం బోధనాసుపత్రి (సూపర్ స్పెషాలిటీతో సహా), గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతోపాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక చేశారు. ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న ‘పాత్’ సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుంది.

### పిఎస్ఎ ప్లాంట్లు ఉపయోగమా..నిరర్థకమా

కోవిడ్-19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో డీఎంఈ పరిధిలో 62 ఆసుపత్రుల్లో, సెకండరీ హెల్త్ పరిధిలో 100 (మొత్తం162) పీఎస్ఏ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే ఆక్సిజన్ ప్యూరిటీ (నాణ్యత), నిర్వహణా నియంత్రణకు సంబంధించి తగిన సాంకేతి సిబ్బందని నియమించకపోవడం, ఐసీయూ మరియు సాధారణ వార్డులకు ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన నాణ్యతతో నిమిత్తం లేకుండా ఒకే పైపులైన్ వ్యవస్థ ఉండడంవంటి వివిధ కారణాలవల్ల 162 కు 161 పీఎస్ ఎ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఈ ప్లాంట్ల మరమ్మతులకు డిఎంఈ పరిధిలో రూ.6.20 కోట్లు, నిర్వహణకు ఏటా రూ. 2.60 కోట్లు, డియస్‌హెచ్ పరిధిలో మరమ్మతులకు రూ.4.76 కోట్లు, నిర్వహణ కోసం ఏటా రూ6.7కోట్లు అవసరమవుతుందని, మంత్రికి వివరించారు. ఈ మేరకు నిధులు ఖర్చుచేసిన ఈ పీఎసీ ప్లాంట్లను పూర్తిస్థాయిలో వినియోగించవచ్చా? ఆర్థికంగా ఈ ఖర్చు సమర్థనీయమా? కాకుంటే ఈ నిరర్థక ప్లాంట్లను ఏంచేయాలన్న విషయాలపై కూడా నివేదిక తెప్పించాలని మంత్రి ఆదేశించారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఇలాంటి ప్లాంట్ల పనితీరును కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు

### తక్షణ చర్యలకు మంత్రి ఆదేశం

కోవిడ్-19 నేపథ్యంలో భారీగా పెరిగిన ఎల్ఎంఓ కొనుగోలును వీలైనంతమేర తగ్గించేందుకు బోధనాసుపత్రుల్లో తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు ఆసుపత్రుల్లో ఎల్ఎంఓ నిల్వ, సరఫరాల్లో ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు సమాచారం ఉన్నందున ఈ విధమైన వృథాను తగ్గించేందుకు వెంటనే పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయాలని, ఆ మేరకు ఆసుపత్రులకు వెంటనే ఆదేశాలివ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. వార్డుల స్థాయిలో, ఐసియులో పడకల స్థాయిలో ఆక్సిజన్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. ఎల్ఎంఓ సరఫరా, వినియోగానికి సంబంధించి అధ్యయన కమిటీ నివేదిక అందిన వెంటనే మరో సమీక్ష నిర్వహించి అక్సిజన్ కొనుగోలు వాస్తవ డిమాండ్ మేరకే జరిగేలా స్పష్టమైన ఆదేశాలను మంత్రిత్వ శాఖ జారీచేస్తుందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్, ఏడీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి, డీఎంఈ జాయింట్ డైరెక్టర్ గణపతిరావు, డీఎస్‌ఎచ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుజాత, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులను ఆదుకోలేని జగన్‌కు

# రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్టుగా మాట్లాడటం జగన్ మోహన్ రెడ్డికి ఏమాత్రం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదేళ్ల పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా వారికి అండగా నిలవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుతో చేతులు దులుపుకుని రైతులను మార్కెట్ కరుణకే వదిలేసిందని మండిపడ్డారు. రైతులకు శాశ్వత ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవడంలో, మార్కెట్‌లో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణ ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 25 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి వేలాది మంది రైతులకు అండగా నిలిచామని చెప్పారు. అలాగే ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతులను ఆదుకునేందుకు లో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుకు కిలోకు రూ.10ల ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే కేంద్ర కార్యాచరణ కొనసాగుతోందన్నారు. రైతులకు మార్కెట్ భరోసాతో పాటు ఆర్థిక తోడ్పాటు కూడా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని సాధించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (గ్రామీణ) కింద అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించేలా కేంద్ర వ్యవసాయ శాఖ, బీమా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా చర్చలు జరిపిందన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం సాధ్యమైందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఇతర అనివార్య పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా కీలక రక్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల రుణగ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతు కూడా ఇన్సూరెన్స్ కట్టుకోవాలని , అతి తక్కువ ప్రీమియం ధరను రైతులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించి, ఇన్సూరెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఆగస్టు 15లోపు పంటల బీమాలో నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టసుఖాలు తెలియని వారు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం విడ్డూరమని, మాటలతో కాదు... చేతలతో రైతులకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ నిబద్ధత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి: మంత్రి నారాయణ

అమరావతి సింధూర దర్శిని: అమరావతి నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులు,కాంట్రాక్ట్ సంస్థలపై ఉందన్నారు. మంత్రి నారాయణ.సచివాలయంలోని రెండో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో సీఆర్డీఏ ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశానికి అమరావతి గ్రోత్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ కుమార్ తో పాటు సీఆర్డీఏ ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణా రెడ్డి,ఏజీఐసీఎల్ చీఫ్ ఇంజినీర్లు, హాజరయ్యారు. ప్రధానంగా అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఐకానిక్ భవనాల పనుల పురోగతిపై మంత్రి చర్చించారు.పనులు ఏ విధంగా జరుగుతున్నాయనేది అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వర్షాకాలంలో కూడా పనులకు



ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయని ఇంజినీర్లు మంత్రికి వివరించారు. అసెంబ్లీ,హైకోర్టుతో పాటు జీఏడీ టవర్,నాలుగు హెచ్ ఓడీ టవర్లను ఐకానిక్ భవనాలుగా ప్రభుత్వం నిర్మిస్తుంది. ఇప్పటికే ఆయా భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. 2028 ఆగస్ట్ నాటికి మొదటి విడత అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించడంతో దానికి తగ్గట్టుగా ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేసేలా అధికారులు ముందుకెళ్తున్నారు.

# అర్హులందరికీ ‘నేతన్న సేవలో..’

(మొదటిపేజీ తరువాయి)

రూ.25 వేలను ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, అయిదో తేదీలోగా అర్హులైన చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత కోరారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే సమయంలో చేనేతలకు వ్యక్తిగతంగా ఆర్థిక వృద్ధి కలిగేలా పలు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టామన్నారు. 50 ఏళ్లు నిండిన నేతలన్నకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి లబ్ధి కలిగేలా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగ్గం మీద నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్ ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్రా రుణాలను కూడా అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

### హామీ ఇవ్వకున్నా ‘నేతన్న సేవలో...’ అమలు

ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలతో పాటు హామీ ఇవ్వని పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేతకూ ఏడాదికి రూ.25 వేలు అందించనున్నామన్నారు. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వ పరంగా అండాలనే ఉద్దేశంతో నూతన పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. చేనేత కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

### 5 వరకూ దరఖాస్తులకు గడవు

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నెల అయిదో తేదీ సాయంత్ర అయిదు గంటల్లోకా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు లక్ష్య సాధనలో భాగంగా, విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో పథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు.

### 7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం

ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆనాటి వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అదే రోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత వస్త్రాల వినియోగంపై ప్లకార్డులు కూడా ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు , ఆప్కో అధికారులు పాల్గొన్నారు.



## కుంభాభిషేక ఉత్సవాలను విజయవంతం చేయండి

**ఆలయ చైర్మన్ వాటంబేడు శివకుమార్, ఆలయ ఈవో రవికృష్ణ**

గూడూరు(సింధూరదర్శిని) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణం లోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ధర్మరాజు స్వామి దేవస్థానం లో ఈ నెల 15,16 ,17 తేదీలలో రాజగోపుర శిఖర ప్రతిష్ట మరియు కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులందరూ పాల్గొని స్వామి అమ్మవారికృపకు పాత్రులు అవ్వాలని ఆలయ కమిటీ చైర్మన్ వాటంబేడు శివకుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో ఈవో రవికృష్ణ మరియు పాలకమండలి సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీచైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ శ్రీధర్మరాజస్వామి వారి దేవస్థానం లో రాజగోపుర శిఖర ప్రతిష్ట కుంబాభిషేక ఉత్సవాలు ఈనెల 15,16,17 తేదీలలో వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మూడు రోజు లపాటు జరిగే గొప్ప అభిషేక ఉత్సవాలకు భక్తులందరూ విచ్చేసి స్వామి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. దేవాల యానికి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల లీజు చాలా సంవత్సరాల నుండి పొడిగించలేదని తక్కువ బాడుగలు వసూలు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నూతనంగా దుకాణాల బడుగులను పెంచిందని పాత బకాయిలు పెంచిన బాడుగ ధరల ప్రకారం దుకాణదారులు చెల్లించాలని కోరారు. కొంతమంది పాత బకాయిలు చెల్లించారని, ఆడబ్బు చెల్లింపుల్లో అవకతవ కలు జరిగాయని ఆరోపణలు వచ్చాయని ఎక్కడ ఎటువంటి అవినీతి జరగ లేదని అన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఉజ్జయిని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందానికి తిరుమలలో ఘన స్వాగతం



తిరుమల (సింధూర దర్శిని) 3 ఆగస్టు తిరుపతి జిల్లా; మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినికి చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు చెందిన 153 మంది సభ్యులు దక్షిణ భారతదేశ సాంప్రదాయ వారసత్వం, సంస్కృతి, ఆధ్యాత్మిక విశిష్టతలను పరిచయం చేసే విద్యా–సాంస్కృతిక పర్యటనలో భాగంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకు నేందుకు విచ్చేశారు.ఆగస్టు 3, 4 తేదీలలో జరుగుతున్న తిరుమల పర్యటన సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులకు ఆత్మీయ స్వాగతం పలికి, తిరుమలలోని విష్ణు నివాసంలో వసతి సౌకర్యాలు కల్పించారు. అలాగే శ్రీవారి దర్శనం సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాయింట్ సెక్రటరీ పుష్ప పర్యవేక్షించారు. ఈ బృందానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించేందుకు జిల్లా స్కౌట్స్ సభ్యులు ఎస్. బాలి ప్రసాద్, జె. చంద్రశేఖర్ రాజు, సి. సావిత్రి, పి. పద్మావతి కేర్‌టేకింగ్ బృంద సభ్యులుగా సమన్వయంతో సేవలందిస్తున్నారు. తమ తిరుమల పర్యటన విజయవంతంగా సాగేందుకు అవసరమైన వసతి, దర్శనం మరియు ఇతర ఏర్పాట్లు చేసి సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులు, స్కౌట్స్ అధికారులు, సిబ్బందికి ఉజ్జయిని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేసింది. జాతీయ సమైక్యత, సేవాభావం, సాంస్కృతిక పరస్పర అవగాహన పెంపొందించడంలో ఇటువంటి విద్యా, సాంస్కృతిక పర్యటనలు విద్యార్థు లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

**జిల్లా ఎస్పి డా.అజిత వెజెండ్ల**

నెల్లూరు (సింధూర దర్శిని) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా; ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల మరియు ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 179 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలి.బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్. పి తో పాటు అడిషనల్ ఎస్. పి అడ్మిన్ సౌజన్య వేమారెడ్డి సీఐ సుబ్బారావు భక్తవత్సల్ రెడ్డి, దశరద రామారావు, శ్రీనివాసులు రెడ్డి మరియు పీజీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఏ ఒక్క ఎకరా ఎండిపోకుండా

# రైతాంగాన్ని ఆదుకుంటాం

**కావలి కాలువ పరిధిలో ప్రణాళికాబద్ధంగా చివరి వరకు సాగునీరు అందించేలా నిర్ణయం**

**సైఫన్ పునర్నిర్మాణంతో పాటు కావలి కాలువ ఆధునికీకరణకు చర్యలు**

**కావలి, ఉదయగిరి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్**

**కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన సమీక్ష**

**కావలి కాలువపై వారాబంధీ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి ; కలెక్టర్**



కావలి (సింధూర దర్శిని) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా ; కావలి నియోజకవర్గంలో ఏ ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకుండా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కావలి కాలువలో నీటి నిర్వహణ, 12వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న సైఫన్, చివరి ఆయకట్టు వరకు సాగునీటి సరఫరాపై విస్తృతంగా చర్చించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి రైతులకు సమన్యాయం జరిగేలా కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. కావలి కాలువ పరిధిలోని ఇంజన్ మోటార్లు గల రైతులకు వారానికి మూడు రోజులు సాగునీరు అందించే విధంగా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, మిగిలిన నాలుగు రోజుల్లో అనధికార మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి కాలువ చివరి భాగంలోని రైతులకు కూడా సమానంగా నీరు అందేలా చర్యలు చేపడతామని చెప్పారు.కావలి చెరువును నింపడంతో పాటు చెరువు కింద ఆయకట్టు, ఎస్‌విపీఎం పరిధిలోని రైతులకు కూడా సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రైతులు అపోహలకు గురికాకుండా పరస్పర సహకారంతో వ్యవహరిస్తే ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని పేర్కొన్నారు. సోమశిలలో నీటి లభ్యత ఉందని, శ్రీశైలం నుంచి కూడా నీటి ప్రవాహం కొనసాగుతోందని, త్వరలో మరింత నీరు చేరుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, కావలి కాలువ 12వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న సైఫన్‌ను స్వయంగా పరిశీలించామని, దీని కారణంగా చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. అనధికార మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి చివరి వరకు సాగునీరు అందించేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సైఫన్‌ను శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మిం చాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కావలి కాలువలో దెబ్బతిన్న ఇతర నిర్మాణాలు, గేట్ల మరమ్మతులు కూడా వెంటనే చేపట్టాలని సూచించినట్లు చెప్పారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఇరిగేషన్ వ్యవస్థను ఆధునికీకరించి రైతులకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, కావలి కాలువ రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా నీటి నిర్వహణ చేపట్టాలని, ఈరోజు నుంచే వారాబందీ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నీటి విడుదల జరిగే నాలుగు రోజులపాటు కాలువపై ఉన్న మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సూచించారు. సెప్టెంబర్ 15 వరకు ఏ కాలువకు ఎంత మేర నీటిని విడుదల చేయాలనే కార్యాచరణను సిద్ధం చేయాలని, ప్రతి రైతు ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కావలి కాలువలోని సైఫన్‌తో పాటు దెబ్బతిన్న అన్ని నిర్మాణాల మరమ్మతులకు అవసరమైనంత నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, టెండర్లు పిలిచి నీటి ప్రవాహం నిలిచిన వెంటనే పనులు ప్రారంభించి నవంబర్ 30లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ ఆధునికీకరణతో పాటు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సోమశిల ఎస్‌ఈ శ్రీరామ్ చంద్రమూర్తి, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ నాయక్, కందలేరు ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, ఎలక్ట్రికల్ ఎస్‌ఈ రాఘవేంద్ర, ఆత్మకూరు, కావలి ఆర్డీవోలు పావని, ఎలీషా, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, నీటి సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో అర్జీలను పరిశీలించి శాశ్వత పరిష్కారం అందిస్తాం: కమిషనర్ ఓ.నందన్

నెల్లూరు (సింధూర దర్శిని) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా; రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వై.ఓ నందన్ లు పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రజలనుంచి అందుకున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీలను పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించేం దుకు కృషి చేస్తామని తెలిపారు. కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ టిడ్కో గృహాలలో గృహాలు మంజూరు అయినప్పటికీ స్వాధీనం పొందక ఉన్న వాటిని అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయిస్తున్నా మని, అర్హులైనవారు టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్థానిక పొదలకూరు రోడ్డు ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం సుమారు 8 కోట్ల రూపాయలతో డివైడర్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నా మని, అయితే దుకాణదారులు రోడ్డు ఆక్రమణలకు పాల్పడుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని కమిషనర్ తెలిపారు.ఇటీవల రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఉన్న రోడ్డు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి ప్రజా రవాణాకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు.

అదే విధంగా మినీ బైపాస్, ట్రంకు రోడ్డు ప్రాంతాలలో కూడా రోడ్డు ఆక్రమణలను నిరంతరం తొలగిస్తున్నామని, పొదలకూరు రోడ్డు ప్రాంతంలోని రోడ్డు ఆక్రమణలను గుర్తించి తప్పనిసరి గా తొలగించి వేస్తామని కమిషనర్ తెలియజేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, ఇతర ఆర్ అండ్ బి రోడ్లను ఆక్రమించి ఎలాంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టరాదని, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాంతాలలో రోడ్డు విస్తరణ పనులను తప్పనిసరిగా చేపడతామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 43 , టౌన్ ప్లానింగ్ 09, రెవెన్యూ 04, ఇంజనీరింగ్ 10, అకౌంట్ సెక్షన్ 01, పబ్లిక్ హెల్త్ 01, ఆప్కాస్ 02, హెచ్ సెక్షన్ 01, పెన్షన్ 01 మొత్తం 72 వినతులను మేయర్, కమిషనర్ లు స్వీక రించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ హిమ బిందు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈలు శేషగిరిరావు, అనిల్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దినేష్, టౌన్ ప్లానింగ్ విభాగం సతీష్, ఉద్యానశాఖఅధికారి నరసింహా రావు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బివి పురంలో తల్లిపాల వారోత్సవాలు

**సిడిపిఓ శాంతి దుర్గ**

శ్రీకాళహస్తి( సింధూరదర్శిని)3 ఆగస్టు తిరుపతి జిల్లా; శ్రీకాళ హస్తి రూరల్ మండలం బివి పురం అంగనవాడి కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ శాంతి దుర్గ సూచనలతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రేడ్ వన్ సూపర్వైజర్ ప్రియాంక మాట్లాడుతూ తల్లిపాలు యొక్క ప్రాముఖ్యతను తల్లులకు వివరిస్తూ పౌష్టికాహారంతోనే తల్లులు బిడ్డలకు పాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని పౌస్తికాహారం ఆకుకూరలు, కాయగూ రలు, పండ్లు, గుడ్లు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఎం.ఎల్.హెచ్.పి నలిని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే మొదటి గంటలోపు ముర్రు పాలు ఇవ్వాలని ఇది సహజ సిద్ధమైన టీకా లాగా పనిచేసి జీవితాంతం వ్యాధి నిరోధ శక్తిని పెంచుతుందని తెలిపారు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఏమి ఇవ్వకూడదని తెలిపారు తల్లి పాలు తాగడం వల్ల పిల్లల్లో న్యూమోనియా విరేచనాలు ఊబకాయం వంటి రోగాలు రాకుండా తల్లికి కూడా రొమ్ము అండాశయ క్యాన్సర్లు వంటి ముప్పు తగ్గుతుందని వివరించారు. అనంతరం తల్లులకు తల్లి పాలు ఇవ్వడంపై ఉన్న అపోహలను సందేహాలకు సలహాలు ఇచ్చారు ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తల్లిపాలతోనే బిడ్డ ఎదుగుదల శారీరిక మానసిక పరిపక్వత తల్లి బిడ్డల అనుబంధం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం తల్లులకు పౌష్టికాహారం పాలు గుడ్లు, బాలమృతం అందించారు అనంతరం తల్లిపాల వారోత్సవాలు పోస్టర్లు విడు దల చేసి తల్లులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ప్రగతి కో కన్వీనర్ రామచంద్ర అంగన్వాడీ టీచర్లు ఈశ్వరి విమల మౌనికశాంతి తల్లులు గర్భిణీలు పాల్గొన్నారు.



# రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

**ఆగస్టు 01 నుండి విక్రయాల ప్రారంభం - తిరుపతి జిల్లాలో 28 కేంద్రాల్లో అందుబాటులోకి బియ్యం విక్రయాలు**

**రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు చర్యలతో ప్రజలకు ఊరట - జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్**

**ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం**



తిరుపతి (సింధూర దర్శిని) 3 ఆగస్టు తిరుపతి జిల్లా ; రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం ఆగస్టు 01 నుండి విక్రయాల ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా తిరుపతి జిల్లాలో 28 కేంద్రాలలో తక్కువ ధరకే బియ్యం విక్రయాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి పట్టణం నందు రైతుబజార్‌లో జరిగిన తక్కువ ధరల బియ్యం విక్రయ ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్కువ ధరల బియ్యం విక్రయ కార్యక్రమాన్ని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావులతో కలసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో రెండు రకాల ఫైన్ వెరైటీ బియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో కిలోకు రూ.65 ల నుంచి రూ.70 ల వరకు విక్రయిస్తున్న స్టీమ్డ్ బీపీటీ బియ్యాన్ని రూ.52 లకు, రూ.58 నుంచి రూ.62 వరకు విక్రయిస్తున్న రా బీపీటీ బియ్యాన్ని రూ.50లకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 115 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమం అమలవుతుండగా, తిరుపతి జిల్లాలో 28 కేంద్రాల్లో బియ్యం విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదవుతున్నాయని, తిరుపతి జిల్లాలో జూన్, జూలై నెలల్లో సుమారు 22 శాతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 22 జిల్లాలకు పైగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. వర్షాభావం కొనసాగితే వరి ఉత్పత్తి తగ్గి బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా రైస్ కార్డుదారులకు మార్కెట్ ధర కంటే కిలోకు రూ.10 నుంచి రూ.14 వరకు తక్కువ ధరకే బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్కో రైస్ కార్డు కు నెలకు 26 కిలోల బియ్యాన్ని ఒకే బ్యాగ్ రూపంలో అందజేస్తామని, విడివిడిగా విక్రయించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు మాట్లాడుతూ, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతుబజార్లు, రైస్ మిల్లర్ల అవుట్‌లెట్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 115 రైతుబజార్లు, 500 ప్రత్యేక విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మార్కెట్‌లో రూ.65కు విక్రయించే స్టీమ్డ్ బియ్యాన్ని రూ.52కే, రూ.58కు విక్రయించే రా బియ్యాన్ని రూ.50కే అందించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన వస్తువులను అందుబాటు ధరల్లో అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఒ రామ్మోహన్, పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచల రాజు, మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అవస్థలు



**మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి**

గూడూరు( సింధూర దర్శిని) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా ; డీ.ఎస్సీలో జరిగిన అవకతవకలపై బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ మంత్రి మరియు వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా అద్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డీ.ఎస్సీ స్కాం బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ...గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య అద్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తరలి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ ఆంక్షలు విధించడంతో పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుండి పీవీఆర్ కల్యాణ మండపానికి చేరుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నాయకులు క్రేన్ సాయంతో భారీ గజమాలను వేసి ఘన స్వాగతం పలికారు. కల్యాణ మండపంలో జ్యోతిప్రజ్వలన గావించారు. వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..గూడూరులో సభను అడ్డుకోవాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోందన్నారు. జగన్ పేరు చెబితేనే వ్యవస్థలు వణికి పోతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇవ్వకుండా తక్కువ మొత్తంలో జమ చేశారని, ఆ మొత్తం సొమ్ము ఎక్కడికి వెళ్ళిందని ప్రశ్నించారు. డీ.ఎస్సీలో జరిగిన అవకతవకల కారణంగా యువత పెద్ద ఎత్తున నష్టపోయిందని, డీ.ఎస్సీ స్కాంకు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని కాకాణి డిమాండ్ చేశారు. ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త బూదూరు గురవయ్య, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాయకులు ఎద్దల నరేంద్ర రెడ్డి, కోడూరు కల్పలత, నాశిన నాగులు, మీరారెడ్డి, సునీల్ రెడ్డి, బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం మొహిద్దీన్, అజీజ్ ఖాన్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

**వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించండి - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**

నెల్లూరు (సింధూర దర్శిని ) 3 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డిప్యూటీ కలెక్టర్లు వంశీకృష్ణ, కేశవర్ధన రెడ్డి, మెప్మా పీడి కిరణ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత



గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీ-ఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి మానవతాదృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ అందించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

తిరుపతి( సింధూర దర్శిని) 3 ఆగస్టు తిరుపతి జిల్లా ; ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, నాగార్జున లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. సంబంధిత అధికారులు అందరూ సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా అర్జీలను పరిష్కరించాలని తెలిపారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం

**తిరుపతి ఆర్డీవో రామ్మోహన్**




తిరుపతి (సింధూర దర్శిని) 3 ఆగస్టు తిరుపతి జిల్లా ; లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందని, లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తెలిపారు. సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన జరిగిన పిసిపిఎన్డిటి సబ్ డిస్టిక్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ మరియు అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు ప్రభుత్వం ఎన్నో పథకాలను, ప్రోత్సాహకాలను అమలు చేస్తోందని ,ఆడపిల్ల ల యొక్క ప్రాముఖ్యతను గురించి సామాన్య ప్రజల్లో, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. తిరుపతి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సిల్వియా మాట్లాడుతూ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించడంలో రెవెన్యూ మరియు పోలీస్ శాఖల సహాయ సహకారాలు అందించాలన్నారు. డిప్యూటీ డెమో బలరామరాజు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలు, డాక్టర్లు, ప్రోత్సహించే వారి సమాచారాన్ని అందించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫ్రీనెంబర్ 18002332447 ప్రవేశపెట్టిం దని, అలాంటి సమాచారం ఏదైనా ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తెలుపవచ్చని సమాచారాన్ని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని అన్ని స్కానింగ్ కేంద్రాలలో ఈ టోల్ ఫ్రీ నెంబర్ను డిస్ప్లే చేయాలని తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ , కమిటీ సభ్యులైన ఎస్వీ మెడికల్ కాలేజ్ గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, రేడియాలజిస్ట్ డాక్టర్లు, ఎం సి ఎస్ ఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## 8న నెల్లూరులో ఏపి హియరింగ్ హ్యాండిక్యాప్డ్

**ఎంప్లాయీస్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం**

నెల్లూరు(సింధూరదర్శిని) 3ఆగస్టు నెల్లూరు జిల్లా; ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవాన్ని ఈ నెల 8వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నెల్లూరులోని రేబాల లక్ష్మీ నర్సారెడ్డి టౌన్ హాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు వి. కుమార్, కార్యదర్శి టి. గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 600మంది హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, పరస్పర అనుభవాలను పంచుకోవడం ఈ 10వ వార్షికోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.







# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 622 మందికి రూ.6.07కోట్ల ఆర్థిక సాయం:మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి సింధూరదర్శిని: తెనాలి నియోజక వర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు 622 మంది లబ్ధిదారులకు రూ.6.07 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్న కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ భారీ వైద్య ఖర్చులు భరించిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. వైద్య సహాయం అవసరమైన వారు ఆసుపత్రి బిల్లులు, సంబంధిత పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకుంటే, అర్హత మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఎవరూ ఇబ్బంది పడకుండా, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రతి దరఖాస్తును పరిశీలించి సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు వైద్య బీమా (మెడికల్ ఇన్సూరెన్స్) రక్షణ కల్పించే పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో ప్రజలు ధైర్యంగా, భరోసాతో వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వం పాలన అంతా ప్రజా వ్యతిరేక, మోసపూరిత పాలన

**డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై నిర్వహించిన పెదకూరపాడు నియోజకవర్గస్థాయి టౌన్ హల్ సదస్సులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**





క్రోసూరు సింధూరదర్శిని: కూటమి ప్రభుత్వం చేస్తున్న పరిపాలన ప్రజా వ్యతిరేక మోసపూరిత పాలన చేస్తుందని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం క్రోసూరు లోని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీ ఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై నిరసిస్తూ ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి టౌన్ హల్ సదస్సు లో ముఖ్య అతిధిగా నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో పెదకూరపాడు నియోజకవర్గ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఏనుముల మురళీధర్ రెడ్డి , వై యస్ ఆర్ సీపీ రాష్ట్ర స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు పానుగంటి చైతన్య , నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కరోజులోనే లక్ష పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాజీ ముఖ్య మంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి గారికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హమీలు అమలు చేయకుండా మోసం చేసారన్నారు. డీ ఎస్సీ లో లోకేష్ తో పాటు పాదయాత్ర చేసినవారికి ఉద్యోగాలు ఇచ్చి మెరిట్ విద్యార్థులను, స్పోర్ట్స్ లో కనబరిచిన వారిని మోసం చేశారు అన్నారు. అసలు ఇది డీ ఎస్సీ కాదు దగా డీ ఎస్సీ అన్నారు. డీ ఎస్సీ నియామకలలో జరిగిన అవకతవకలపై వై యస్ ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 10 వ తేదీ వరకు జగబోయే ప్రతీ ఉద్యమ కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని డీ ఎస్సీ అక్రమాలపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.

# తక్కువ ధరతో బీపీటీ బియ్యం పంపిణీ

**జిల్లా రైస్ మిల్లర్స్ నాయకులు ఊరా భాస్కరరావు, మక్కెన మహేష్ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ**





వినుకొండ సింధూరదర్శిని: లబ్ధిదారులకు ప్రభుత్వ ఆదేశాల సారం వినుకొండ నియోజకవర్గ రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్లను ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక శాసనసభ్యులు జివి ఆంజనేయులు చేతులమీదుగా స్వయంగా అందజేశారు. వినుకొండ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బహిరంగ మార్కెట్ ధర కంటే కిలోకు 10 రూపాయలు తక్కువ ధరతో బీపీటీ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా. పేద, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసరాల ధరల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా రైస్ మిల్లర్స్ నాయకులు ఊరా భాస్కరరావు, మక్కెన మహేష్, డిసిసిబి ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు ,అధికారులు ఉన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



మాచర్ల, సింధూరదర్శిని: పేద ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునురుద్ఘాటించారు. సోమవారం స్థానిక కోదండ రామాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలో అందించేందుకు రైతు బజార్లు, గుర్తించిన రైస్ మిల్లుల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, తన చేతుల మీదిగా ప్రజలకు బియ్యాన్ని అందజేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.., మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీపీటీ స్టీమ్ రైస్ రూ. 52, బీపీటీ రా రైస్ రూ. 50 ధరలకు ప్రజలకు ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతాటిపై నడిపిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సీఎస్డీటీ బాషా, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, కూటమి పార్టీల నాయకులు యాంగటి మల్లికార్జునరావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యొనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, యలమంద, కంభంపాటి అనిల్ కుమార్, సంభోజు వేణు, పులుసు రఘు, ఓర్సు కాంతి కుమార్, చంటి, గణేష్, అన్వర్, గరిణే శ్రీను, పినిశెట్టి కృష్ణ మాదినేటి శాంతి, వేముల మంగమ్మ, నాగమణి, అనురాధ, దుర్గా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ పై హైకోర్టును ఆశ్రయించాం

- గతంలో ప్రశ్నిస్తే దాడులు చేశారు.
- జిల్లా పరిషత్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదు
- కోర్టులపై నమ్మకం ఉంది
- పెదకూరపాడు జడ్పిటిసి కంకణాల స్వర్ణకుమారి



పెదకూరపాడు సింధూరదర్శిని: పెదకూరపాడు మండల పరిధిలోని గారపాడు గ్రామంలో ఊరి ఉమ్మడి భూమిలో (ఎద్దుల భూమి) గ్రామంలోని కొందరు అక్రమ మైనింగ్ పాల్పడి జల వనరులు శాఖ ఆధీనంలో ఉన్న నీటి చెరువుకుంటను అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారని గతంలో అధికారులకు మొరపెట్టినా, జిల్లా పరిషత్ సమావేశంలో తెలిపిన అధికారులు పట్టించుకోలేదని, అధికారులు, పాలకులు అండదండతో భారీ వాహనాలతో మైనింగ్ చేశారని ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు విచారణ స్వీకరించటం సంతోషంగా ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెదకూరపాడు జడ్పిటిసి కంకణాల స్వర్ణకుమారి సోమవారం విలేకరులతో తెలిపారు. ఊరు ఉమ్మడి భూమిని, నీటి చెరువు కుంటను ఆక్రమించి దందా చేశారన్నారు. గ్రామంలో నీటి అవసరాల కోసం, భూగర్భ జలాల పెంపుదల కోసం, పాడి పశువులకు తాగునీటి కోసం నీటి చెరువు కుంట ఉంటే ఊరు ఉ మ్మడి భూమి నుండి అక్రమ మైనింగ్ చేసి కుంటను పూడ్చి అందులో కట్టడాలను చేపట్టారన్నారు. ఈ విషయమై అధికారులను ఆశ్రయించిన పట్టించుకోలేదని గ్రామంలోని కొందరు కోర్టును ఆశ్రయించగా కోర్టు లో సంబంధిత అధికారులు అక్రమ కట్టడాలను నిలిపివేసామని కోర్టుకు తెలిపారు అన్నారు . అనేక పర్యాయాలు ప్రశ్నిస్తే మా ఇంటి పైకి వచ్చి దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు లో న్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా అడ్డుకుంటానని చెప్పారు.

# వేల్పూరు వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి, సింధూరదర్శిని:అచ్చంపేట మండలం వేల్పూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన నరేంద్ర, రంగుశెట్టి నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.



# క్యాన్సర్ గడ్డలకు సరికొత్త చికిత్స.. ప్రపంచంలోనే తొలిసారి!


ఘన కణితుల చికిత్స కోసం ప్రపంచంలోనే తొలి 'CAR-T' థెరపీ ప్రారంభం

న్యూజిలాండ్‌కు చెందిన క్యాన్సర్ రోగికి చైనాలో ఈ సరికొత్త చికిత్స

రోగి రోగనిరోధక కణాలనే మార్పు చేసి క్యాన్సర్‌పై దాడి చేసేలా చేసే వినూత్న ప్రక్రియ

దశాబ్దాలుగా సవాలుగా ఉన్న సాలిడ్ ట్యూమర్ల చికిత్సలో ఇది చరిత్రాత్మక ముందడుగు

చైనా అభివృద్ధి చేసిన 'శాత్రి-సెల్' అనే ఈ థెరపీపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి



క్యాన్సర్ చికిత్సా రంగంలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. గడ్డల రూపంలో ఏర్పడే క్యాన్సర్లకు (సాలిడ్ ట్యూమర్స్) వ్యతిరేకంగా ప్రపంచంలోనే తొలిసారిగా ఆమోదం పొందిన 'కైమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్' (CAR) T-సెల్ థెరపీ చికిత్సను మొదటి అంతర్జాతీయ రోగికి అందించడం ప్రారంభమైంది. ఇప్పటివరకు కేవలం రక్త క్యాన్సర్లకే పరిమితమైన ఈ అధునాతన సెల్యులార్ ఇమ్యునోథెరపీ, ఇప్పుడు ఘన కణితుల చికిత్సలోనూ సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

న్యూజిలాండ్‌కు చెందిన 59 ఏళ్ల జాష్, తీవ్రమైన గ్యాస్ట్రోడ్యూడెనల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. తన దేశంలో అందుబాటులో ఉన్న అన్ని చికిత్సా విధానాలు విఫలం కావడంతో ఆయన చివరి ఆశగా చైనాలోని షాంఘైలో ఉన్న జియాహుయ్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ సెంటర్‌ను ఆశ్రయించారు. అక్కడ నిర్వహించిన బయోమార్కర్ పరీక్షల లో, అతని క్యాన్సర్ కణాలపై క్లాడిన్18.2 (CLDN18.2) పాజిటివ్‌గా, హెచ్‌ఈఆర్2 (HER2) నెగటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో చైనాలో మాత్రమే అందుబాటులో ఉన్న 'శాత్రిక్యాబ్టాజీన్ ఆటోల్యూసెల్ (శాత్రి-సెల్)' అనే ఈ సరికొత్త థెరపీకి ఆయన అర్హత సాధించారు. ఇటీవలే ఆయన ల్యూకాఫెరిసిస్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ ప్రక్రియలో అతని రక్తం నుంచి రోగనిరోధక కణాలను వేరు చేశారు. ప్రస్తుతం ఈ కణాలను ల్యాబ్‌లో క్యాన్సర్‌పై పోరాడేలా ఇంజనీరింగ్ చేస్తున్నారు. రాబోయే వారాల్లో ఈ శక్తివంతమైన కణాలను తిరిగి జాష్ శరీరంలోకి ప్రవేశపెడతారు.

### ఏమిటీ 'CAR-T' థెరపీ?

'జూా=-ు' థెరపీ అనేది ఒక విప్లవాత్మక చికిత్సా విధానం. ఇందులో రోగి శరీరం నుంచే రోగనిరోధక కణాలను (ు-కణాలు) సేకరిస్తారు. ప్రయోగశాలలో వాటికి క్యాన్సర్‌ను గుర్తించి, దానిపై దాడి చేసి నాశనం చేసేలా జన్యుపరంగా మార్పులు చేస్తారు. ఈ శక్తివంతమైన కణాలను తిరిగి రోగి శరీరంలోకి ఎక్కించడంతో, అవి క్యాన్సర్ కణాలను వెతికి మరీ అంతం చేస్తాయి. గత దశాబ్ద కాలంగా ఈ థెరపీ రక్త క్యాన్సర్ల చికిత్సలో అద్భుత ఫలితాలు ఇస్తోంది.

అయితే, గడ్డల రూపంలో ఉండే ఘన కణితుల విషయంలో ఈ థెరపీని అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. కణితి చుట్టూ ఉండే సంక్లిష్ట వాతావరణం, యాంటిజెన్ వైవిధ్యం వంటి కారణాలతో ఈ థెరపీలు సమర్థంగా పనిచేయలేకపోయాయి. 'శాత్రి-సెల్' ఆమోదంతో ఆ అడ్డంకి తొలగిపోయింది. చైనా 'నేషనల్ మెడికల్ ప్రొడక్ట్స్ అడ్మినిస్ట్రేషన్' (ఎన్‌ఎంపీఏ), రెండుసార్లు ఇతర చికిత్సలు విఫలమైన క్లాడిన్18.2-పాజిటివ్, హెచ్‌ఈఆర్2-నెగటివ్ గ్యాస్ట్రిక్ క్యాన్సర్ రోగుల కోసం ఈ ఏడాది 2026 జూన్ లో 'శాత్రి-సెల్' థెరపీకి ఆమోదం తెలిపింది. కీలకమైన రెండవ దశ క్లినికల్ ట్రయల్స్‌లో, ఇతర చికిత్సలతో పోలిస్తే ఈ థెరపీ తీసుకున్న రోగులలో వ్యాధి తీవ్రత పెరగకుండా ఎక్కువ కాలం నియంత్రించగలిగినట్లు తేలింది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం చివరి దశ క్యాన్సర్ రోగులకు ఇది ఒక కొత్త చికిత్సా మార్గాన్ని అందిస్తున్నప్పటికీ, దీని దీర్ఘకాలిక సమర్థత, విస్తృత లభ్యత, తొలి దశల్లోనే దీనిని ఉపయోగించే అవకాశాలపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. ఏదేమైనా, ఈ పరిణామం చైనా సెల్యులార్ థెరపీ రంగంలో సాధిస్తున్న పురోగతికి, ప్రపంచవ్యాప్తంగా రోగులు సరికొత్త చికిత్సల కోసం సరిహద్దులు దాటుతున్నారనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# శాస్త్రవేత్తలకే సవాలుగా నిలిచిన 10 క్లిష్టమైన సమస్యలు.. పరిష్కరించిన 'ఆస్ట్రా' ఏఐ!

-తన కొత్త ఏఐ మోడల్ 'ఆస్ట్రా'ను పరిచయం చేసిన ఓపెన్ఏఐ

-గణితం, క్వాంటం సైన్స్‌లో 10 క్లిష్టమైన సమస్యలను ఇది పరిష్కరించిన వైనం

-ఏఐ రూపొందించిన పరిష్కారాలను శాస్త్రవేత్తలు 'లీన్' టూల్‌తో ధ్రువీకరణ

-ఒక్కో పరిష్కారానికి సుమారు 2,000 డాలర్ల కంప్యూటింగ్ ఖర్చు అయినట్లు వెల్లడి

-ఈ ఫలితాలను సమీక్షించనున్న ప్రపంచ శాస్త్రవేత్తల బృందం




చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్ఏఐ మరో సంచలన ప్రకటన చేసింది. తాము ఇంకా విడుదల చేయని 'ఆస్ట్రా' అనే తమ కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడల్, శాస్త్రీయ రంగంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 10 అతిపెద్ద సమస్యలను విజయవంతంగా పరిష్కరించినట్లు వెల్లడించింది. గణితం, క్వాంటం కాంప్లెక్సిటీ, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో ఈ ఘనత సాధించడం టెక్నాలజీ ప్రపంచంలో చర్చకు దారి తీసింది. ఈ వాదనలను ప్రపంచ శాస్త్ర వేత్తల సంఘం నిశితంగా పరిశీలించి ధ్రువీకరిస్తే, ఇది చరిత్రలో నిలిచిపోయే ఘట్టం అవుతుంది. కేవలం మనుషుల కు సహాయం చేసే డిజిటల్ అసిస్టెంట్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి శాస్త్రీయ పరిశోధనల్లో భాగస్వామిగా ఏఐ మారుతోందనడానికి ఇది నిదర్శనం.

### పరిష్కార ప్రక్రియ ఇలా..

ఈ సమస్యలను 'ఆస్ట్రా' ఎలా పరిష్కరించిందో ఓపెన్ఏఐ తన అధికారిక బ్లాగ్‌పోస్ట్‌లో వివరించింది. అత్యంత క్లిష్టమైన గణిత రుజువులను ఈ ఏఐ మోడల్ పూర్తిగా సొంతంగా రూపొందించింది. ఆ తర్వాత, పరిశోధకులు రంగంలోకి దిగి, ఏఐ రూపొందించిన సమాధానాలను 'లీన్' అనే ప్రత్యేక ప్రూఫ్ అసిస్టెంట్ టూల్ సహాయంతో కంప్యూటర్ ద్వారా ధ్రువీకరించే ఫార్మాట్‌లోకి మార్చారు. ఈ ప్రక్రియ ద్వారా ఏఐ ఆలోచనలోని ప్రతి దశను తనిఖీ చేసి, ఎలాంటి తప్పులు లేవని నిర్ధారించుకున్నారు. ఒక్కో సమస్యకు విజయవంతమైన పరిష్కారం కనుగొనడానికి ప్రస్తుత ఏపీఐ ధరల ప్రకారం సుమారు 2,000 డాలర్ల (సుమారు రూ. 1.90లక్షలు) కంప్యూటింగ్ శక్తి ఖర్చయిందని ఓపెన్ఏఐ తెలిపింది.

'ఆస్ట్రా' పరిష్కరించిన సమస్యలు అత్యంత సంక్లిష్టమైనవి. వాటిలో 'నాన్-సోఫిక్ గ్రూప్' అనే ఒక కొత్త గణిత నిర్మాణాన్ని స్పష్టంగా నిర్మించడం కూడా ఉందని ఓపెన్ఏఐ పేర్కొంది. దీనితో పాటు క్వాంటం ప్యారలల్ రిపిటీషన్ సిద్ధాంతానికి సంబంధించిన రుజువును అందించింది. అలాగే, ఎర్హార్ట్ వాల్యూమ్ కంజెక్చర్, కోనెస్ రిజిడిటీ కంజెక్చర్ వంటి ప్రఖ్యాత గణిత సిద్ధాంతాలపై కూడా తాజా ఫలితాలను రాబట్టింది. ఈ ఆవిష్కరణలు మానవ మేధస్సుకు సవాలుగా నిలిచిన అంశాలు కావడం గమనార్హం. గణిత రంగంలో ఓపెన్ఏఐ విజయం సాధించడం ఇదే మొదటిసారి కాదు. కొన్ని నెలల క్రితం, 80 ఏళ్ల నాటి 'ప్లానార్ యూనిట్ డిస్టెన్స్' సమస్యపై తమ ఏఐ మోడల్ ఒక కొత్త పురోగతి సాధించిందని ప్రకటించింది. ఇప్పుడు 'ఆస్ట్రా' సాధించిన ఈ 10 కొత్త పరిష్కారాలు కూడా అదే స్థాయిలో కఠినమైన సమీక్షకు వెళ్లనున్నాయి. ప్రపంచ శాస్త్రవేత్తల బృందం వీటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ విజయాల ప్రాముఖ్యత ఎంతనేది స్పష్టమవుతుంది. ఏదేమైనా గతంలో యంత్రాలకు అసాధ్యం అనుకున్న పరిశోధన సమస్యలను సైతం ఇప్పుడు ఏఐ వ్యవస్థలు ధైర్యంగా పరిష్కరిస్తున్నాయని చెప్పడానికి ఇది మరో బలమైన నిదర్శనం.

# యూపీఐలో పెద్ద మార్పు.. ఇక ప్రతి చెల్లింపూ ఒక్క క్లిక్‌తో కాదు!


యూపీఐ చెల్లింపులకు కొత్త భద్రతా ప్రతిపాదన - అనుమానాస్పద లావాదేవీలకు అదనపు నిర్ధారణ

రిస్క్ ఉన్న వాటికే వర్తింపు - పెరుగుతున్న డిజిటల్ మోసాల నేపథ్యంలో నిర్ణయం

వేగం తగ్గకుండా భద్రత పెంచాలని బ్యాంకుల లక్ష్యం - ప్రతిపాదనను పరిశీలిస్తున్న ఆర్‌బీఐ

యూపీఐ చెల్లింపుల్లో త్వరలో కొత్త భద్రతా విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద లావాదేవీలకు అదనపు నిర్ధారణ విధానాన్ని తీసుకురావాలని బ్యాంకులు భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కు (ఆర్‌బీఐ) ప్రతిపాదించాయి. దీనికి ఆమోదం లభిస్తే ప్రమాద సూచనలు ఉన్న కొన్ని యూపీఐ చెల్లింపులు ఒక్క క్లిక్‌తో పూర్తికావు. వినియోగదారుడి నుంచి మరోసారి స్పష్టమైన అంగీకారం తీసుకున్న తర్వాతే లావాదేవీ పూర్తవుతుంది. బ్యాంకుల ప్రతిపాదన ప్రకారం.. మోసాల గుర్తింపు వ్యవస్థ ఏదైనా లావాదేవీని అనుమానాస్పదంగా గుర్తిస్తే వినియోగదారుడి స్క్రీన్‌పై 'Yes/No' నిర్ధారణ సందేశం కనిపిస్తుంది. వినియో గదారుడు 'Yes' ఎంచుకున్న తర్వాతే చెల్లింపు పూర్తవుతుంది. సాధారణ యూపీఐ లావాదేవీలకు ఈ అదనపు దశ ఉండదు. ప్రమాద సూచనలు కనిపించిన సందర్భాల్లో మాత్రమే ఇది అమల్లోకి వస్తుంది.

ఇటీవల కాలంలో యూపీఐ మోసాలు వేగంగా పెరుగుతున్నాయి.




సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ కస్టమర్ కేర్ పేరుతో వినియోగదారుల ను మోసగించి డబ్బు బదిలీ చేయిస్తు న్నారు. యూపీఐ చెల్లింపులు వెంటనే పూర్తవడం వల్ల డబ్బు వెళ్లిపోయిన తర్వాతే చాలామందికి మోసం జరిగిన విషయం తెలుస్తోంది. ఇలాంటి ఘటనలను తగ్గించేందుకు చెల్లింపునకు ముందు కాసేపు ఆలోచించే అవకాశం కల్పించడమే ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశమని బ్యాంకులు భావిస్తున్నాయి. అయితే అన్ని భారీ విలువ గల లావాదేవీలపై తప్పనిసరిగా ఆలస్యం విధించడం లేదా కూలింగ్ పీరియడ్ పెట్టడాన్ని బ్యాంకులు వ్యతిరేకిస్తున్నాయి. అలా చేస్తే యూపీఐ ప్రధాన బలమైన వేగం, సౌలభ్యం దెబ్బతింటాయని చెబు తున్నాయి. అందుకే ప్రతి లావాదేవీకి కాకుండా ప్రమాద సూచనలు ఉన్న వాటికే అదనపు నిర్ధారణ ఉండాలని సూచించాయి. ఏ లావాదేవీ ప్రమాదకరమో బ్యాంకుల రిస్క్ అనాలిసిస్ వ్యవస్థ నిర్ణయిస్తుంది. అసాధారణంగా పెద్ద మొత్తం, తొలిసారి డబ్బు పంపుతున్న ఖాతా, కొత్త మొబైల్ పరికరం, కొత్త ప్రాంతం నుంచి లావాదేవీ జరగడం, గతానికి భిన్నంగా చెల్లింపు ఉండటం వంటి అంశాలను పరిశీలించి అనుమానాస్పదంగా గుర్తించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదనలపై ఆర్‌బీఐ పరిశీలన కొనసాగుతోంది. ఆమోదం లభిస్తే యూపీఐ చెల్లింపుల్లో భద్రత మరింత బలోపేతం కానుంది.

# గోద్రెజ్ బీరువా నుంచి సిప్ దాకా.. తొలి జీతం చెప్పే ఆర్థిక పాఠాలు!

తొలి జీతంపై మారిన తరాల ప్రాధాన్యతలను తెలిపే ఆసక్తికర కథనం

ఒకప్పుడు గోద్రెజ్ బీరువాల్లో సంపద

తర్వాతి తరం ఎఫ్‌డీలు, ఎల్ఐసీలతో భద్రతకు పెద్దపీట

బాధ్యతతో పాటు సిప్‌లతో సంపద సృష్టిపై నేటి యువతరం దృష్టి

'మీ మొదటి జీతంతో ఏం చేశారు?'.. ఇది చాలా సాధారణ ప్రశ్నలా అనిపించినా, జీవితకాలపు జ్ఞాపకాలను మన కళ్లముందు నిలుపుతుంది. ఈ ఒక్క ప్రశ్నకు దొరికే సమాధానాలు, కొన్ని దశాబ్దాలుగా భారతీయుల ఆర్థిక ప్రాధాన్యతలు, డబ్బుతో వారికున్న సంబంధం ఎలా మారిందో స్పష్టంగా వివరిస్తాయి. గోద్రెజ్ బీరువాలో డబ్బు దాచుకున్న తరం నుంచి, జీతం రాగానే సిప్ చేసే నేటి తరం వరకు ఈ ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగింది.

### సంపదను కాపాడుకున్న తరం

95 ఏళ్ల ప్రీత్‌పాల్ కౌర్ సేథి జ్ఞాపకాల ప్రకారం.. ఒకప్పుడు కుటుంబ సంపద అంటే మ్యూచువల్ ఫండ్స్ కాదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు అంతకన్నా కాదు. వారి సంపదనంతా గోద్రెజ్ బీరువా లాకర్‌లో భద్రంగా ఉండేది. కట్టలకొద్దీ నోట్లు, బట్టలో చుట్టిన బంగారు ఆభరణాలే వారికి ఆర్థిక భద్రత. ఆ తరం సంపదను పెంచడం కంటే, దాన్ని కాపాడుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. భారతీయ రైల్వేలో పనిచేసి రిటైరైన 91 ఏళ్ల విద్యాసాగర్ శర్మ తన తొలి జీతం అందుకున్న రోజును గుర్తుచేసుకుంటూ, "నాకు బాధ్యత పెరిగినట్లు అనిపించింది" అన్నారు. ఆయన ఆ డబ్బును నేరుగా తన తల్లిదండ్రుల చేతిలో పెట్టారు. ఆ రోజుల్లో సంపాదన అనేది వ్యక్తిగత విజయం కాదు, కుటుంబ విజయం. కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులకే తొలి ప్రాధాన్యం ఉండేది.



### భద్రతకు పెద్దపీట వేసిన తరం

తర్వాతి తరంలో ఆర్థిక క్రమశిక్షణ, భద్రతకు ప్రాధాన్యం పెరిగింది. 70 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తన అనుభవాన్ని పంచుకున్నారు. ఐదుగురు తోబుట్టువులలో పెద్దవాడైన ఆయన.. తన తొలి జీతాన్ని తల్లిదండ్రులకు ఇచ్చి, అందులోంచి కొద్ది మొత్తాన్ని "పాకెట్ మనీ"గా తీసుకునేవారు. ఆ తరంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయడం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు (ఎన్ఎస్‌సీ) కొనడం, ఎల్ఐసీ పాలసీ తీసుకోవడం ఒక సంప్రదాయంగా ఉండేది. అధిక రాబడి కంటే మూలధనాన్ని కాపాడుకోవడమే ముఖ్యమని వారు భావించారు.

### బాధ్యత, పెట్టుబడిని బ్యాలెన్స్ చేస్తున్న తరం

నేటి యువతరం ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. విద్యాసాగర్ శర్మ మనవరాలు, 25 ఏళ్ల శ్రుతి శర్మ తన తొలి జీతం రాగానే కుటుంబానికి కొంత ఆర్థికంగా సాయం చేయాలని నిర్ణయించుకుంది. బాధ్యతకు విలువ ఇస్తూనే, పొదుపు మాత్రమే ద్రవ్యోల్బణాన్ని అధిగమించలేదని గ్రహించింది. అందుకే, మ్యూచువల్ ఫండ్స్, సిప్‌లను తన ఆర్థిక ప్రయాణంలో భాగం చేసుకుంది. "మా తాతల తరం సంపదను కాపాడుకుంది. మా తల్లిదండ్రులు క్రమశిక్షణతో పొదుపు చేశారు. మా తరానికి మెరుగైన పెట్టుబడి మార్గాలతో సంపదను సృష్టించే అవకాశం ఉంది" అని ఆమె వివరించింది. తొలి జీతం తాలూకు ఆనందం, గర్వం తరాలు మారినా అలాగే ఉన్నాయి. కానీ, ఆ డబ్బుతో ఏం చేయాలనే ఆలోచన మాత్రం మారింది. గోద్రెజ్ బీరువాలో నగదు నుంచి ప్రతి నెలా ఆటోమేటిక్‌గా కట్ అయ్యే సిప్ వరకు.. భారతీయుల ఆర్థిక ప్రయాణం ఎంతో పరిణతి చెందింది.

# ‘మోడరేట్ హిందువు’ నుంచి ‘మేల్కొన్న హిందువు’గా మారా: కంగనా

పాత వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో వ్యాఖ్యలు

హిందుత్వంపై తన ఆలోచనల్లో వచ్చిన మార్పును వివరిస్తూ ఇన్‌స్టా వీడియో

నచ్చిన భావజాలాన్ని ఎంచుకునే స్వేచ్ఛ హిందూ మహిళలకూ ఉండాలని వ్యాఖ్య

తాను సంఘ్ భావజాలాన్ని స్వీకరించాలనుకుంటున్నానని వెల్లడి



తాను ఒకప్పుడు ‘మోడరేట్ హిందువు’నని, ఇప్పుడు ‘మేల్కొన్న హిందువు’గా మారానని బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ వ్యాఖ్యానించారు. ఇటీవల తన పాత వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. హిందుత్వంపై తన ఆలోచనల్లో వచ్చిన మార్పును వివరిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పంచుకున్నారు.

పార్లమెంట్‌కు వెళ్లే ముందు తన మనసులోని భావాలను పంచుకోవాలని పించిందని కంగనా రనౌత్ వీడియోలో చెప్పారు. సినీ పరిశ్రమలో చాలా మంది హిందూ మహిళలు రాజకీయాలు, మతం వంటి అంశాలపై స్పష్టమైన భావజాలం లేకుండా తటస్థంగా ఉంటారని అన్నారు. యువతలో ఇలాంటి ధోరణి సాధారణమేనని వ్యాఖ్యానించారు. అయితే కొందరు ఇస్లామిస్టులతో పరిచయం పెరిగిన తర్వాత వారి ఆలోచనలు మారి వామపక్ష భావజాలం వైపు వెళ్తారని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన మతాన్ని, భావజాలాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చిందని కంగనా అన్నారు. అదే స్వేచ్ఛ హిందూ మహిళలకు కూడా ఉండాలని పేర్కొన్నారు. తాను గతంలో ‘మోడరేట్ హిందువు’గా ఉండేదాన్నని, ఇప్పుడు మాత్రం ‘మేల్కొన్న హిందువు’గా మారాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లా క్రమశిక్షణతో కూడిన హిందుత్వ భావజాలాన్ని స్వీకరించాలనుకుంటున్నానని వెల్లడించారు. “నేను సంఘ్ భావజాలాన్ని స్వీకరించాలనుకుంటున్నాను. మేల్కొన్న హిందువుగా మారాలనుకుంటున్నాను. నాకు ఆ హక్కు ఎందుకు ఉండకూడదు? ఇతరులు తమ భావజాలాన్ని మార్చుకోవచ్చని చెబుతారు. అయితే హిందూ మహిళలు తమ ఆలోచనలను మార్చుకోవడానికి ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు?” అని కంగనా ప్రశ్నించారు.

ఈ విషయంలో ద్వంద్వ వైఖరి సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. కొన్ని రోజుల క్రితం యువతను ఉద్దేశించి “గట్టర్ ఛాప్” అంటూ కంగనా చేసిన వ్యాఖ్యలు కూడా వివాదానికి దారి తీశాయి. తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియాలో కొందరు ఆమె అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

# ఒలింపిక్ పతక విజేతలూ అబద్ధాలు చెబుతారు.. బ్రిజ్ భూషణ్ సంచలన వ్యాఖ్యలు

బ్రిజ్ భూషణ్‌కు కోర్టులో ఊరట – “ఇది నా విజయం కాదు” అన్న బ్రిజ్ భూషణ్

ఒలింపియన్లపై సంచలన వ్యాఖ్యలు –2023లో రెజ్లర్ల నిరసనతో కేసు ప్రారంభం

నిర్దోషిగా బ్రిజ్ భూషణ్, వినోద్ తోమర్



మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా తేలిన తర్వాత డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలు నిరూపితం కాలేదన్నారు. ఒలింపియన్‌లు, ఒలింపిక్ పతక విజేతలు కూడా తమ స్వప్రయోజనాల కోసం అబద్ధాలు చెబుతారని ఈ తీర్పుతో తేలిందని వ్యాఖ్యానించారు. మహిళా రెజ్లర్లు నమోదు చేసిన లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసులో రౌస్ అవెన్యూ కోర్టు బ్రిజ్ భూషణ్, డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. తీర్పు తర్వాత ఐఏఎన్ఎస్‌తో మాట్లాడిన బ్రిజ్ భూషణ్.. ఇది తన విజయం కాదని అభిప్రాయపడ్డారు. జూనియర్ రెజ్లర్ల విజయం అని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల హక్కుల కోసం తాను పోరాడినందుకే తనపై ఈ ఆరోపణలు వచ్చాయని ఆరోపించారు. ఈ కేసు ఒలింపియన్‌లు, ఒలింపిక్ పతక విజేతలు కూడా తమ స్వప్రయోజనాల కోసం అబద్ధాలు చెబుతారని నిరూపించిందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలపై గతంలో చేసిన వ్యాఖ్యల గురించి ప్రశ్నించగా ప్రస్తుతం ఎవరి పేరూ ప్రస్తావించబోనని బ్రిజ్ భూషణ్ చెప్పారు. ఒకటి, రెండు పార్టీలను మినహాయిస్తే దేశంలో తనను ఉరితీయాలని, సజీవ దహనం చేయాలని డిమాండ్ చేసిన విషయం అందరికీ తెలుసని అన్నారు. కోర్టు తనను గౌరవప్రదంగా నిర్దోషిగా ప్రకటిం చిందని, దోషిగా తేలితే ఉరివేసుకుంటానని గతంలో చెప్పానని, కానీ అలాంటి పరిస్థితి రాలేదని వ్యాఖ్యానించారు. ఈ కేసు 2023 జనవరిలో ప్రారంభమైంది. ఒలింపియన్‌లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా సహా పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టారు. బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణలు చేస్తూ ఆయన రాజీనామాతో పాటు డబ్ల్యూఎఫ్ఐ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భారత ఒలింపిక్ సంఘం విచారణ కమిటీ ఏర్పాటు చేయగా, కేంద్ర క్రీడల శాఖ డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాలను సస్పెండ్ చేసింది. తాజాగా కోర్టు ఇద్దరినీ నిర్దోషులుగా ప్రకటించడంతో ఈ కేసు విచారణ ముగిసింది.

# భారత ఐటీ రంగానికి కొత్త హెచ్చరిక

హెచ్‌సీఎల్ టెక్‌తో ఒప్పందంలో గూగుల్ కోత

హెచ్‌సీఎల్‌టెక్ ఒప్పందాన్ని ఏటా 5 కోట్ల డాలర్లు తగ్గించిన గూగుల్

ఏఐ, ఆటోమేషన్‌తో అవుట్‌సోర్సింగ్‌లో మార్పులు – వెయ్యి మంది ఉద్యోగుల పునర్విభజనకు అవకాశం

భారీ ఉద్యోగ కోతలు ఉండవని సంకేతాలు




ఏఐ ప్రభావం ఐటీ రంగంపై మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు భారీ మానవ వనరులపై ఆధారపడిన ప్రాజెక్టులు ఇప్పుడు ఆటోమేషన్, కృత్రిమ మేధతో కొత్త రూపం దాలుస్తున్నాయి. ఈ మార్పులో భాగంగా గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దకాలంగా హెచ్‌సీఎల్‌టెక్‌తో కొనసాగుతున్న ఒప్పందాన్ని కుదిస్తూ కొత్త సంకేతాలు ఇచ్చింది. అయితే ఉద్యోగుల తొలగింపుల కంటే పనుల పునర్విభజనకే కంపెనీ ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. అయితే భారత ఐటీ రంగానికి ఈ పరిణామాన్ని కొత్త హెచ్చరికగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. గూగుల్ తన అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్ సేవల్లో భాగంగా హెచ్‌సీఎల్‌టెక్‌కు అప్పగించిన అవుట్‌సోర్సింగ్ ఒప్పందాన్ని ఏడాదికి ఐదు కోట్ల డాలర్ల మేర తగ్గించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ ఒప్పందం విలువ గతంలో ఏటా సుమారు 20 కోట్ల డాలర్లుగా ఉండేది. ఇప్పుడు దాని పరిధిని కుదించడంతో హెచ్‌సీఎల్‌టెక్‌కు వచ్చే వార్షిక ఆదాయంలో 5 కోట్ల డాలర్ల తగ్గుదల ఉండొచ్చని అంచనా. ఇది కంపెనీ మొత్తం వార్షిక ఆదాయంలో సుమారు 0.3 శాతం మాత్రమే. ఈ నిర్ణయం వల్ల భారీ స్థాయిలో ఉద్యోగాల కోత ఉండదని సమాచారం. గూగుల్ ప్రాజెక్టుపై పనిచేస్తున్న దాదాపు వెయ్యి మంది హెచ్‌సీఎల్‌టెక్ ఉద్యోగులను ఇతర ప్రాజెక్టులకు మార్చనున్నట్లు తెలుస్తోంది. ఏఐ, క్లౌడ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు సంబంధించిన కొత్త పనుల్లో వీరిని వినియోగించే అవకాశం ఉంది. నైపుణ్యం కలిగిన సిబ్బందిని కొనసాగిస్తూ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు మార్చడం ఐటీ రంగంలో పెరుగుతున్న ధోరణిగా నిపుణులు చెబుతున్నారు.

# సెన్సెక్స్‌కు 544 పాయింట్లు, నిఫ్టీకి 391 పాయింట్ల లాభం

ముడి చమురు ధరల తగ్గుదల అంచనాలతో ఇన్వెస్టర్లలో జోష్ – ఐటీ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధాన బలం

మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాల్లో ముగింపు – ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమావేశంపై మార్కెట్ దృష్టి



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలతో పాటు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరిగే అవకాశాలపై వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో సానుకూలత పెంచాయి. దీంతో సోమవారం కొనుగోళ్ల జోరు కనిపించింది. సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 391 పాయింట్లు ఎగిసి 24,774.30 వద్ద స్థిరపడింది. కొత్తగా ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) ప్రభావంతో నిఫ్టీలో మరింత బలమైన ర్యాలీ కనిపించింది. మార్కెట్‌లో ఐటీ షేర్లు ప్రధానంగా రాణించాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిఫ్టీలో అత్యధిక లాభాలు నమోదు చేశాయి. ఐటీ రంగంలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు బలాన్నిచ్చింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.21 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.29 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు మంచి లాభాలు నమోదు చేశాయి. మరోవైపు నిఫ్టీ మీడియా సూచీ మాత్రం నష్టాల్లో ముగిసింది. సాంకేతికంగా నిఫ్టీకి 24,600 స్థాయి కీలక నిరోధంగా మారిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిని దాటితే 24,800 వరకు సూచీ వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

మరోవైపు 24,500 నుంచి 24,400 మధ్య స్థాయి కీలక మద్దతుగా నిలుస్తుందని, ఈ స్థాయి దిగువకు వస్తే స్వల్పకాలిక లాభాల స్వీకరణ పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. మొదటి త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా వస్తుండటం కూడా మార్కెట్‌కు ఊతమిచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్ కంపెనీల పనితీరు ఆశాజనకంగా ఉందని చెప్పారు. ఇక రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారని, వడ్డీ రేట్లలో మార్పు ఉండకపోయినా ద్రవ్యోల్బణం, లిక్విడిటీపై ఆర్‌బీఐ వ్యాఖ్యలు కీలకంగా మారే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.


# అయోధ్య ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం.. తప్పుకున్న ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేత

రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యతల నుంచి వైదొలిగిన భయ్యాజీ జోషి

విరాళాల దొంగతనం వివాదం నేపథ్యంలో ట్రస్ట్‌లో కీలక మార్పులు

అనారోగ్య కారణాలు చూపుతూ తప్పుకున్న భయ్యాజీ జోషీ

ఆర్‌ఎస్‌ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ నేత జోషి



అయోధ్య రామమందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటు చేసుకోవడం గమనార్హం. అయితే, తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు 78 ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026 జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నగదు కానుకల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి దాదాపు రూ. 80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. భయ్యాజీ జోషి 2009 నుంచి 2021 వరకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. గతంలో రామజన్మభూమికి సంబంధించిన భూముల కొనుగోళ్లలో అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన్ను ట్రస్ట్ పాట్రన్‌గా నియమించారు. ఆయన పాత్ర ప్రధానంగా తెరవెనుక సలహాలకే పరిమితమైంది. విరాళాల వివాదం పార్లమెంటులోనూ అధికార, విపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీయగా, పారదర్శక విచారణకు సహకరిస్తామని, విరాళాల నిర్వహణలో సంస్కరణలు చేపడుతున్నామని ట్రస్ట్ ప్రకటించింది.

# పాపులర్ షూమార్ట్ అధినేత విజయ్‌కుమార్ మృతి

గుండెపోటుతో కన్నుమూసిన విజయ్ కుమార్

దిగ్భ్రాంతిలో విజయవాడ వ్యాపార వర్గాలు

సంతాపం వ్యక్తం చేసిన సుజనా చౌదరి

ప్రముఖ వ్యాపార సంస్థ ‘పాపులర్ షూమార్ట్’ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన అకస్మాత్తుగా కన్నుమూయడంతో విజయవాడ వ్యాపార వర్గాలతో పాటు ఆయన సన్నిహితులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ‘పాపులర్ షూమార్ట్’ గత ఆరు దశాబ్దాలకు పైగా నాణ్యమైన సేవలతో ప్రజల విశేష ఆదరణను, విశ్వాసాన్ని పొంది ప్రముఖ వ్యాపార సంస్థగా చెరగని ముద్ర వేసింది. సంస్థ పురోగతిలో విజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. విజయ్ కుమార్ మరణవార్త తెలుసుకున్న బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విజయవాడ వ్యాపార రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు.



# సినిమా న్యూస్



ట్రామాకాన్ 2025లో ఎలిగాన్స్ మరియు కాన్ఫిడెన్స్‌తో మెరిసిన శివాంగి వర్మ హివాంగి ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉన్నారు మరియు ఆమె తన అనుచరులకు ఎంతో ఆనందాన్ని తెస్తున్నారు.

## వారణాసి నుంచి రామాయణం దాకా.. 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్... వారణాసి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్ చిత్రంపై ఒక భారీ అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా షూటింగ్ దాదాపు 80 శాతం పూర్తయిందని, కేవలం చిన్న చిన్న సన్నివేశాల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని రాజమౌళి స్వయంగా వెల్లడించారు.
సినిమాలోని కీలకమైన సన్నివేశాలు, భారీ యాక్షన్ ఘట్టాల చిత్రీకరణ ఇప్పటికే ముగిసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. తాజా ఇంటర్వ్యూలో రాజమౌళి మాట్లాడుతూ, సినిమా కథ, దాని పరిధి గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఇది ఒక భారీ యాక్షన్-అడ్వెంచర్ చిత్రమని, ఇందులో టైమ్ ట్రావెల్ అంశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కథ కోసం దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా (2022 నుంచి) పనిచేస్తున్నట్లు చెప్పారు. కథ వారణాసిలో మొదలై, అంటార్కిటికా, ఆఫ్రికాకు ప్రయాణించి, అక్కడి నుంచి ఏకంగా రామాయణ యుగానికి వెళ్లి, తిరిగి వారణాసికి చేరుకుంటుందని వివరించారు. తనకు 'ఇండియానా జోన్స్' వంటి అడ్వెంచర్ కథలంటే చాలా ఇష్టమని, ఈ సినిమా ఆ తరహాలోనే ఉంటుందని అన్నారు. సినిమాను పూర్తిస్థాయిలో ఐమాక్స్ (IMAX) ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు రాజమౌళి తెలిపారు. కథకు ఉన్న భారీ స్పాన్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అంటార్కిటికాలో 300 అడుగులకు పైగా ఎత్తున్న మంచు పర్వతం, రామాయణ కాలంలోని భారీ వానర సైన్యం వంటి సన్నివేశాలను అత్యంత ప్రభావవంతంగా



చూపించడానికి ఐమాక్స్ కెమెరాలు వాడుతున్నట్లు చెప్పారు. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తన సినిమాల్లో ఐమాక్స్ టెక్నాలజీని వాడిన విధానం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. వారణాసి చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్‌తో పాటే పోస్ట్-ప్రొడక్షన్ పనులు, అంతర్జాతీయ సంస్థలతో వీఎఫ్ఎక్స్ వర్క్ కూడా సమాంతరంగా జరుగుతున్నాయని రాజమౌళి వివరించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది (2027) ఏప్రిల్ 7న విడుదల చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

> చిత్రం షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తి
> వారణాసి నుంచి అంటార్కిటికా, రామాయణ యుగం వరకు సాగే కథ
> హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా, విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్
> వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా విడుదల చేసేందుకు ప్లాన్

## శూర్పణఖ పాత్రను ఎందుకు అంగీకరించారు?

రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర సమాధానం

శూర్పణఖ పాత్రపై స్పందించిన రకుల్ ప్రీత్ సింగ్

పాత్రలోని సంక్లిష్టతే తనను ఆకట్టుకుందని వెల్లడి


ఒకే సంఘటనతో శూర్పణఖను చూడొద్దని అభిప్రాయం

ప్రేక్షకుల అభిప్రాయాలను సవాలు చేసే పాత్రలు ఇష్టమని వ్యాఖ్య

అభిమాని

బహిరంగ లేఖకు 'ఎక్స్'లో స్పందించిన రకుల్

నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'లో శూర్పణఖ పాత్రలో నటిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ తన పాత్ర ఎంపికపై స్పందించింది. సాధారణంగా ఒకే సంఘటనతో శూర్పణఖను గుర్తు చేసుకుంటారని, కానీ ఆమె పాత్రలో అంతకంటే ఎక్కువ లోతు ఉందని చెప్పింది. అలాంటి సంక్లిష్ట పాత్రలు నటిగా తనకు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తాయని వెల్లడించింది.
ఇటీవల రకుల్‌కు ఓ అభిమాని బహిరంగ లేఖ రాశారు. శూర్పణఖ పాత్రను అంగీకరించినందుకు ఆమెను అభినందించింది. రామాయణంలో ఈ పాత్రను చాలామంది ఒక సంఘటనతోనే గుర్తు పెట్టుకున్నా, కథ గమనాన్ని మలుపు తిప్పిన కీలక పాత్రల్లో శూర్పణఖ ఒకరని పేర్కొంది. ఇలాంటి పాత్రను పోషించేందుకు ప్రేరణ ఏంటని ప్రశ్నించింది.
ఆ లేఖకు రకుల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించింది. శూర్పణఖ పాత్రలోని సంక్లిష్టతే తనను ఎక్కువగా ఆకర్షించిందని చెప్పింది. చరిత్ర ఆమెను ఒక సందర్భంతో మాత్రమే గుర్తుంచుకుందని, కానీ ఆమె కథలో ఇంకా ఎన్నో కోణాలు ఉన్నాయని పేర్కొంది.
ప్రేక్షకుల అభిప్రాయాలను సవాలు చేసే పాత్రల్లో నటించడం తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని రకుల్ తెలిపింది. 'రామాయణ' విడుదలైన తర్వాత ప్రేక్షకులు శూర్పణఖ పాత్రను కొత్త కోణంలో అర్థం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేసింది.
నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ సంస్థలు, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి నిర్మిస్తున్నాయి. 'రామాయణ: పార్ట్--1' వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




## భీమవరంలో 'కొరియన్ కనకరాజు' సందడి.. నేడే గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్

ఆగస్టు 4 భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో వేడుక

'కొరియన్ కనకరాజు' పై ఇప్పటికే భారీ అంచనాలు

యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం

ఆగస్టు 7న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్ మెంట్స్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' ప్రీ రిలీజ్ వేడుకకు రంగం సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని రేపు (ఆగస్టు 4) పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4:30 గంటల నుంచి ఈ వేడుక జరగనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.
'కొరియన్ కనకరాజు' చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తుండగా, రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అందిస్తున్న సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని భావిస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను భారీ ఎత్తున ప్లాన్ చేశారు. ఈ వేడుకలో చిత్ర హీరో, హీరోయిన్లు సహా ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొని సందడి చేయనున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలను నెలకొల్పిన 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. భీమవరంలో జరగనున్న ఈ వేడుకతో సినిమాపై అంచనాలు మరింత పెరగనున్నాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఈవెంట్ కోసం చిత్ర యూనిట్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.
కాగా, ఈ సినిమా ప్రి రిలీజ్ వేడుకకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా వస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పవన్ ఇటీవల భుజానికి సర్జరీ చేయించుకున్న నేపథ్యంలో, ఆయన ఇంకా బ్యాండేజ్ తోనే కనిపిస్తున్నారు. దాంతో, ఈ ప్రైవేటు కార్యక్రమానికి ఆయన హాజరయ్యే అవకాశాలు చాలా తక్కువ.




Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662